www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 8 జనవరి 2025



పకడ్బందీగా కానిస్టేబుల్ ఎంపికలు

ప్రజాశక్తి-కడప అర్బన్

కడప నగర శివారులోని డిటిసిలో నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ఎంపిక ప్రక్రియ ఏడో రోజు మంగళవారం కొనసాగింది. అభ్యర్థులకు 1600 మీటర్లు, 100 మీటర్లు, లాంగ్ జంప్ పోటీలను నిర్వహించారు. మొత్తం 600 మంది అభ్యర్థులకు గాను 442 మంది పరీక్షలకు హాజరయ్యారు. 274 మంది క్వాలిఫై అయ్యారు. అభ్య ర్థులకు పిఎంటి, పిఇటి పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాష్ బాబు, ఎఆర్ అడిషనల్ ఎస్పీ బి.రమణయ్య, డిఎస్పీలు, సిఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, ఐటి కోర్ టీమ్, డిపిఒ కార్యాలయ సిబ్బంది ఉన్నారు. దేహదారుఢ్య పరీక్షల్లో ఇప్పటి వరకు ఉమ్మడి కడప జిల్లాలో 4,492 మంది అభ్యర్థులు పాల్గొన్నారు.

వాటర్ గ్రిడ్ ఏర్పాటుకు
కసరత్తు

రూ.1,500 కోట్లతో ప్రతిపాదనలు

ఐదు రిజర్వాయర్ల నుంచి నీటిలభ్యత

జిల్లాలోని 1,540 హ్యాబిటేషన్లకు సరఫరా



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు శుద్ధజలాన్ని అందించేందుకు వాటర్‌గ్రిడ్ (మల్టీ విలేజ్ స్కీమ్) ఏర్పాటుకు కసరత్తు ఊపందుకుంది. జిల్లా గ్రామీణ తాగునీటి సరఫరా ఇంజినీరింగ్ వ్యవస్థ రూ.1500 కోట్ల వ్యయంతో ఐదు రిజర్వాయర్ల నుంచి 1,540 హ్యాబిటేషన్లకు తాగునీటిని అందించడానికి ఉద్దేశించి ప్రతిపాదనలు సిద్ధం చేసింది. జిల్లాలోని బ్రహ్మసాగర్, మైలవరం, గండికోట, తెలుగుగంగ ప్రాజెక్టులో అంతర్భాగమైన ఎస్ఆర్-1, సోమశిల రిజర్వాయర్ల పరిధిలోని 134 టిఎంసిల నుంచి తాగునీటి సరఫరా చేయడానికి ఉద్దేశించి మల్టీ విలేజ్ స్కీమ్‌నకు రూపకల్పన చేసింది. రూ.470 కోట్లతో బ్రహ్మ సాగర్ రిజర్వాయర్ నుంచి మైదుకూరు, బద్వేల్ నియోజకవర్గాల పరిధిలోని కాశినాయన, బి.కోడూరు, పోరుమామిళ్ల, కలసపాడు, బి.మఠం, మైదుకూరు, ఖాజీపేట మండలాల పరిధిలోని 617 హ్యాబిటేషన్లకు చెందిన 2,99,999 మందికి 0.29 టిఎంసిల మేర సరఫరా చేయనున్నట్లు పేర్కొంటోంది. రూ. 280 కోట్లతో మైలవరం రిజర్వాయర్ నుంచి జమ్మలమడుగు, ప్రొద్దుటూరు నియోజకవర్గాల పరిధిలోని పెద్దముడియం, జమ్మలమడుగు, మైలవరం, ప్రొద్దుటూరు, రాజుపాలెం మండలాల పరిధిలోని 157 హ్యాబిటేషన్లకు చెందిన 1,98,777 మందికి 0.17 టిఎంసిల మేరకు సరఫరా చేయనుంది. రూ.490 కోట్లతో గండికోట రిజర్వాయర్ నుంచి జమ్మలమడుగు, కమలాపురం నియో జకవర్గాల పరిధిలోని కొండాపురం, ముద్దనూరు, ఎర్రగుంట్ల, వి.ఎన్‌పల్లి, పెండ్లి మర్రి, వల్లూరు, సికెదిన్నె, చెన్నూరు, కమలాపురం మండలాల పరిధిలోని 479 హ్యాబిటేషన్లకు చెందిన 2,99,826 మందికి 0.30 టిఎంసిల మేరకు తాగుజఎ నీటిని సరఫరా చేయనుంది. తెలుగుగంగలోని ఎస్ఆర్-1 జలాశయం నుంచి రూ.140 కోట్లతో దువ్వూరు, చాపాడు మండలాలకు చెందిన 104 హ్యాబిటేషన్ల పరిధిలోని 93,174 మందికి తాగునీటిని సరఫరా చేయనుంది. రూ.120 కోట్లతో సోమశిల రిజర్వాయర్ నుంచి బద్వేల్, రాజంపేట నియోజక వర్గాలకు చెందిన గోపవరం, బద్వేల్, అట్లూరు, సిద్ధవటం, ఒంటిమిట్ట మండలాలకు చెం దిన 66,955 మందికి శుద్ధజలాన్ని అందించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేసిం ది.పులివెందుల వాటర్‌గ్రిడ్ మినహా మిగిలిన ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 28 మండలాలకు చెందిన 1540 హ్యాబిటేషన్లకు పరిధిలోని 9,58,731 మందికి రూ.1500 కోట్ల వ్యయంతో తాగునీటిని అందించడానికి ప్రణాళికను సిద్ధం చేసింది. జిల్లాలోని ఐదు ప్రధాన ఇరిగేషన్ ప్రాజెక్టుల నిల్వలైన 134 టిఎంసిల నిల్వల నుంచి శుద్ధజలాన్ని అందించనుంది. వేసవి సీజన్‌లో 9.55 టిఎంసిల మేరకు డెడ్‌స్టోరేజీ పడిపోయినప్పటికీ 0.94 53 టిఎంసిల మేరకు తాగునీటిని సరఫరా చేయడానికి అనువుగా ప్రతిపాదనలు సిద్ధం చేసింది. జిల్లా తాగునీటి సరఫరా వ్యవస్థ విభాగం ఇంజినీరింగ్ నిపు ణులు సర్వేలు చేయడంపై దృష్టి సారించింది. సర్వే అనంతరం నివేదికను ప్రభుత్వానికి అందజేయనుంది.

శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కడప శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తామని పరిపాలన అధికారి పి.శివ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం రాష్ట్ర అతిథిగృహంలో సంక్రాంతి సంబరాల కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 11 నుంచి 15 వరకు వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రధానం చేయనున్నట్లు చెప్పారు. 11న ఉదయం 10 గంటలకు మహిళలకు ముగ్గుల పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. 12న కిషోర్ బృందం వారిచే సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. 13న సాయంత్రం భోగి మంటలు, కళాతరంగాని బృందం వారిచే సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. 14న అనూష్ బృందం వారిచే గాలిపటాల ఎగిరివేత, గంగిరెద్దుల ఆటలు ఉంటాయని పేర్కొన్నారు. 15న సాంస్కృతిక కార్యక్రమాలు, కామెడీ స్కిట్లు ఉంటాయని తెలిపారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా నృత్య ప్రదర్శనలు ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో మిస్సా మూవీ పద్మాకర్, శిల్పారామం ఫీల్డ్ సూపర్‌వైజర్ మధుబాబు, సీనియర్ అసిస్టెంట్ రామచంద్ర, జేమ్స్ పాల్గొన్నారు.

ఇన్నోవేట్ సైబర్ టెక్ సొల్యూషన్స్‌తో వైవీయూ ఒప్పందం

ప్రజాశక్తి - కడప అర్బన్ :యోగి వేమన విశ్వవిద్యాలయం ఇన్నోవేట్ సైబర్ టెక్ సొల్యూషన్స్ ప్రయివేట్ లిమిటెడ్‌తో (హైదరాబాద్)తో పరస్పర అవగాహన ఒప్పందం కుదిరింది. ఆ సంస్థ సిఇఒ మోనిక, ఎండీ అభిమన్యురావు, ప్రోగ్రాం డెవలపర్ మందూరు అయ్యప్ప, యోగివేమన యూనివర్సిటీ విసి ఆచార్య కె.కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పద్మ, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథ్ రెడ్డి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ వివిధ ప్రముఖ సంస్థలకు, పరిశ్రమలకు మానవ వనరులను అందించే సైబర్ టెక్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ తమ విద్యార్థులను నైపుణ్యత గల వారిగా తయారు చేస్తారని తెలిపారు. అలానే ఉద్యోగ అవకాశాలకు ప్రమోట్ చేస్తారని వివరించారు. సిఇఒ మాట్లాడుతూ రెండేళ్ల పాటు ప్లేస్‌మెంట్ శిక్షణలు, ఇంటర్న్‌షిప్‌లు ప్లేస్‌మెంట్‌లను అందించడంలో సహాయపడుతామన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి- కమలాపురం : రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని దేవరాజుపల్లి, పెద్దచెప్పలి గ్రామాల్లో పొలంపిలుస్తోందని కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు సూచనలు, సలహాలిచ్చారు. వాతావరణంలో వచ్చే విపరీత మార్పులను అధిగమించాలంటే ప్రకృతి వ్యవసాయమే శరణ్యమని సూచించారు. సుస్థిర వ్యవసాయానికి ఇతర ప్రత్యామ్నాయ మార్గాలు లేని కారణంగా ప్రకృతి వ్యవసాయం వెనక ఉన్న శాస్త్రీయతను అందరూ గుర్తించాలని సూచించారు. యాంత్రికరణ పద్ధతులలో భాగంగా పలు పంటలను ఆశించే పురుగుల నిఘాకు, నియంత్రణకు లింగా కర్షక బుట్టలను, జిగురు అట్టలను ఉపయోగించాలని తెలిపారు.

'పివిఎస్ఆర్ఎమ్' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - కమలాపురం : కమలాపురం పట్టణంలో పివిఎస్ఆర్ఎమ్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఈనెల 4న కడప నగరంలో డిఎస్ఎ స్టేడియంలో నిర్వహించిన స్పోర్ట్స్ లీగ్ క్రీడా పోటీలలో ప్రతిభ కనబరిచారని కరస్పాండెంట్ సి.వి. రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, పరుగు పందెం పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రమణారెడ్డి, పీడీ ఖాదర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

పింఛన్ల తనిఖీ

ప్రజాశక్తి-అట్లూరు :మండలంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం మంచానికే పరిమితమై రూ. 15 వేల పింఛను తీసుకుంటున్న లబ్ధిదారుల పరిస్థితిని ఎంపిడిఒ భాస్కర్‌బాబు ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది నిర్వహి ంచారు. మండలంలో ఐదుగురు రోగులను డాక్టర్ల బృందం పరిశీలించారు. అటూరు, కుంభగిరి, తంబల గుంది, ముత్తుకూరు, కొండూరు తదితర గ్రామా లలో రోగులను డాక్టర్ల బృందం పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ ఆనందరావు, వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-చెన్నూరు : మండల స్థాయి గ్రామపంచాయతీ కార్యదర్శుల సంఘం ఎంపిడిఒ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంది. గ్రేడ్-1 నుంచి గ్రేడ్ - 6 వరకు పంచాయతీ కార్యదర్శులు పాల్గొని కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షులు షేక్ అన్వర్‌బాషా, వైస్ ప్రెసిడెంట్‌గా గోపవరం శ్రీనివాసులు, జనరల్ సెక్రెటరీగా ప్రసాద్ రెడ్డి, ట్రెజరర్‌గా షేక్ గౌస్ బాషా, మహిళా కార్యదర్శిగా ఎల్ సుప్రియ రెడ్డిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కిరణ్ మోహన్‌రావు, కార్యదర్శి రామసుబ్బారెడ్డి, కార్యదర్శులు శివ, ఈశ్వరరావు, డిజిటల్ అసిస్టెంట్ సమతా, గీతా, బాలాజీ పాల్గొన్నారు.

అమరవీరుల స్థూపాన్ని తొలగించడం బాధాకరం

ప్రజాశక్తి-కడప అర్బన్ : నగర సుందరీకరణలో భాగంగా ఎర్రముక్కపల్లె సర్కిల్ వద్ద ఉన్న అమర వీరుల స్థూపాన్ని తొలగించడం బాధాకరమని, వెంటనే ఏర్పాటు చేయాలని జిల్లా మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షులు కె.వి.రావు కోరారు. మంగ ళవారం జిల్లా సైనిక అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశ భవిత కోసం శత్రు దేశాలతో పోరాడి ప్రాణత్యాగం చేసి అసువులు బాసిన వీర జవానుల గౌరవార్థం మెమోరియల్ స్థూపాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై సైనిక సంక్షేమ అధికారి ఎమ్‌డి. రజాక్‌ఖాన్ స్పందిస్తూ కలెక్టర్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి అమరవీరుల స్థూపం ఏర్పాటుకు ప్రయత్నిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎక్స్ సర్వీస్ మెన్ వెల్ఫేర్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ పుల్లయ్య నాయుడు, సభ్యులు కె.ఓబులేసు, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కడప : భూ సమస్యల పరిష్కారానికై ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడు మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం జిల్లాలో 17 గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బద్వేల్ రెవెన్యూ డివిజన్‌లోని అట్లూరు మండలం కొండూరు, కలసపాడు మండలం రెడ్డిపల్లి, కాశినాయన మండలం సావిసెట్టిపల్లి, పోరుమామిళ్ల మండలం మిద్దపాడు, చెన్నకృష్ణాపురంలలో నిర్వహిస్తారని తెలిపారు. పులివెందుల రెవెన్యూ డివిజన్‌లోని చక్రాయపేట మండలం గండికొవ్వూరు, లింగాల మండలం పార్నపల్లె, సింహాద్రిపురం మండలం సింహాద్రిపురం, పులివెందుల మండలం రాగిమానిపలిలో నిర్వహిస్తారన్నారు. జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్‌లోని మైలవరం మండలం లింగాపురం, పెద్దముడియం మండలం పాలూరు, కొండాపురం మండలం వెంకయ్యకాల్వ, జమ్మలమడుగు మండలం పొన్నతోటలలో నిర్వహిస్తారని పేర్కొన్నారు. ముద్దనూరు మండలం యామవరం, దువ్వూరు మండలం చింతకుంట, చాపాడు మండలం అల్లాడుపల్లె , కడప రెవెన్యూ డివిజన్ లోని కమలాపురం మండలం కమలాపురంలలో సదస్సులుంటాయన్నారు.

ఉపాధి అమలుపై ఆన్‌లైన్ శిక్షణ

ప్రజాశక్తి - వల్లూరు

ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు కేటాయించాల్సిన పనిపై రూలర్ డెవలప్‌మెంట్ కమిషనర్ ఆన్‌లైన్ ద్వారా ఉపాధి సిబ్బందికి మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆన్‌లైన్‌లో శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు నెలలు ఉపాధి హామీ పథకం ద్వారా చేయాల్సిన పనులు గుర్తింపు కార్యక్రమాలను వివరించారు. ప్రతి కూలీకి గిట్టుబాటు అయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో వల్లూరు, కమలాపురం ఎంపిడిఒలు రఘురాం, జ్యోతి, ఉపాధి ఎపిఒ సుధారాణి, పార్థసారథి, మండల ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కందుల రాజేశ్వరమ్మ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి- కడప అర్బన్

కందుల విద్యా సంస్థల కరస్పాండెంట్ కందుల రాజేశ్వరీ 70వ పుట్టినరోజు వేడుకలు కెఎస్ఆర్ఎంఇంజినీరింగ్ కళాశాల, కెఒఆర్ఎం ఆడిటోరియంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కటింగ్ చేశారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ మదన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కెఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాల(ఎ), కెఎల్ఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్, కందుల ఓబుల్‌రెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ ఉపాధ్యక్షురాలు, కోశాధికారిగా రాజేశ్వరమ్మ సేవలందిస్తున్నారని తెలిపారు. సంస్థలకు డైరెక్టర్‌గా పనిచేస్తూ అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో కెఎస్ఆర్ఎం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.ఎస్.ఎస్.మూర్తి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ టి.ఎన్. ప్రసాద్, వివిధ విభాగాల డీన్ లు , విభాగాధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న కందుల రాజేశ్వరమ్మ

వెనుకబడిన జిల్లాలకు
ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలి

- ధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్

ప్రజాశక్తి - కడప అర్బన్

అభివృద్ధి చెందిన జిల్లాలతో సమానంగా వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వెకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేయాలని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక నిధుల ప్యాకేజీలను కేంద్ర ప్రభుత్వం విడుదల చేయాలని కోరారు. రాష్ట్ర బడ్జెట్‌లో కూడా నిధులు కేటాయించాలని, రాయలసీమ జిల్లాలలో భారీ పరిశ్రమలు నిర్మించాలని పేర్కొన్నారు. కడప జిల్లాలో కేంద్ర ప్రభుత్వ ఉక్కు కర్మాగారాల నిర్మాణ సంస్థ సెయిల్ ఆధ్వర్యంలో కడప ఉక్కు కర్మాగారం విభజన హక్కు చట్టం హామీని నిలబెట్టే విధంగా నిధులను విడుదల చేసి, పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. గోదావరి మిగులు నీటిని కృష్ణా నది బేసిన్‌కు తరలించి, కృష్ణ బేసిన్ నీటిని రాయలసీమకు, పెన్నానది ఉపనదులకు మళ్లించాలని పేర్కొన్నారు. రాయలసీమ జిల్లాల శాశ్వత కరువు నివారణకు ప్రణాళికలు రూపొందించాలని కోరారు. రాయలసీమ జిల్లాలలో అపారంగా భూమిలో నిక్షిప్తమై ఉన్న వివిధ రకాల ముడి ఖనిజం ఆధారంగా ఎన్నో రకాల పరిశ్రమలు నిర్మించి ఈ ప్రాంత యువతి, యువకులకు ఉపాధి కల్పించవచ్చని, పాలకుల్లో చిత్తశుద్ధి లోపించడం వల్లనే కరువు తాండవిస్తోందని గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఒక కారు పంటకు అన్ని ప్రాంతాల్లోని ప్రజల భూములకు సాగునీరు అందించాలని నిపుణులు చెబుతున్నప్పటికీ అధికారంలోకి వస్తున్న ప్రభుత్వాల పెద్దలు పట్టించుకోవడంలేదని తెలిపారు. వారికి ప్రజలపై, ప్రజల కష్టాలపై, ప్రజల అవసరాలపై తీవ్రమైన దాటవేత పద్ధతులు అవలంభిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది అస్తిత్వ రాజకీయాలకు, ప్రాంతీయ రాజకీయాలకు దారి తీసి అరాచక శక్తుల వెంట ప్రజలు వెళ్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇది అత్యంత ప్రమాదకరమన్నారు. రాయలసీమ ప్రాంత వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి మండలి అనే ఏర్పాటు చేసి దానికి విధివిధానాలు, నిధులు అందించాలని తద్వారా ఈ ప్రాంత ప్రజల అవసరాలు తీర్చాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా సీనియర్ నాయకురాలు ఐ.ఎన్.సుబ్బమ్మ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎ.రామ్మోహన్, బి.మనోహర్, వి.అన్వేష్, జిల్లా కమిటీ సభ్యులు బి.దస్తగిరి రెడ్డి, పి.చాంద్ బాషా, వివిధ మండలాల నుంచి వచ్చిన సిపిఎం నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.


ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్

దారుణం

- మద్యం మత్తులో భార్య, కుమార్తెను హత్య

ప్రజాశక్తి-పులివెందుల టౌన్/తొండూరు


శ్రీలక్ష్మి, గంగోత్రి (ఫైల్‌ఫొటో)

పులివెందుల నియోజకవర్గంలోని తొండూరు మండలంలో దారుణం చోటుచేసుకుంది. మద్యం మత్తులో హంతకునిగామారి భార్య, కుమార్తెను హతమార్చిన భర్త గంగాధర్‌రెడ్డి. నియోజకవర్గంలోని తొండూరు మండలం తేలూరు తిమ్మలపల్లె గ్రామంలో గంగాధర్‌రెడ్డి మద్యం మత్తులో భార్య శ్రీలక్ష్మి(37), కుమార్తె గంగోత్రి (14)లను సోమవారం రాత్రి రాడ్డుతో కొట్టి కొడవలితో నరికి దారుణంగా హత్య చేశాడు. శ్రీలక్ష్మి అంగన్వాడీ కేంద్రంలో సహాయకురాలిగా పనిచేస్తోంది. కుమార్తె గంగోత్రి ఎనిమిదో తరగతి చదువుతోంది. మంగళవారం శ్రీలక్ష్మి వీధిలోకి రాకపోవడంతో అంగన్వాడీ కార్యకర్త ఫోన్ ద్వారా ప్రయత్నించారు. ఆ సమయంలో భర్త గంగాధర్‌రెడ్డి ఫోన్ ఎత్తి నా భార్యను చంపేశానంటూ సమాధానం ఇచ్చాడు. విషయాన్ని స్థానికులు పోలీసులు తరపున పులివెందుల రూరల్ సిఐ వెంకటరమణ సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాలను పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఈ సంఘటనపై కేసు నమోదు చేయడం జరిగిందని, విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తామన్నారు.

హత్యలు, ఆత్మహత్యలతో బెంబేలెత్తుతున్న జనం

ఇటీవల కాలంలో పులివెందుల నియోజకవర్గంలో హత్యలు, ఆత్మహత్యల వరుస ఘటనలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. వేముల మండలం వి.కొత్తపల్లిలో జిలిటెన్ స్టిక్స్‌తో పేల్చి హత్య చేసిన సంఘటన మరువక ముందే, అదే గ్రామంలో ప్రేమించలేదని ఒక అమ్మాయిని 13 కత్తిపోట్లు పొడిచిన సంఘటన చోటుచేసుకుంది, సింహాద్రిపురం మండలం దిద్దికుంటలో ముగ్గురిని హత్య చేసి నాగేంద్ర అనే వ్యక్తి అతను చనిపోవడం సంచలనం రేపింది. పట్టణంలో జయమ్మ కాలనీలో భార్యాభర్తలు ఘర్షణపడి ఓ మహిళ ఉరి వేసుకుని చనిపోవడంతో ఒక్కసారిగా ఉలిక్కిపడింది. లింగాల మండలంలో ప్రేమ పేరుతో ఓ యువకుడిని చిత్రహింస చేసి కొట్టడంతో అవమాన భారంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటుచేసుకుంది. తాజాగా తొండూరు మండలం తేలూరు తుమ్మలపల్లి గ్రామంలో మద్యం మత్తులో భార్య, కుమార్తెను అతి దారుణంగా కొడవలితో నరికి చంపిన ఘటన ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేశాయి. వరుస సంఘటనలతో హత్యలు, ఆత్మహత్యలు జరుగుతుండడంతో ఇక్కడ ఏమైంది అనే పరిస్థితి ఏర్పడింది.


మృతదేహాలను పరిశీలిస్తున్న పోలీసులు


తలపడుతున్న నెల్లూరు, కర్నూలు జట్లు

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి - కడప : కడప జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ అండర్- 12 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా మంగళవారం వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో నిర్వహించిన మ్యాచ్‌లో కర్నూలు జట్టుపై నాలుగు వికెట్ల తేడాతో నెల్లూరు ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 35.0 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 140 పరుగులు చేసింది. ఆ జట్టులోని యోగేష్ సాయి 35, అరుణాచలం 29 పరుగులు చేశారు. అనంతరం 141 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 33.1 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 141 పరుగులు చేసి 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. **ఏడు వికెట్ల తేడాతో కడప జట్టు విజయం..**కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో నిర్వహించిన వేరొక మ్యాచ్‌లో చిత్తూరు జట్టుపై ఏడు వికెట్ల తేడాతో కడప జట్టు ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన చిత్తూ రు జట్టు 35.0 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 157 పరుగులు చేసింది. ఆ జట్టులోని భువన్ సాయి 54, లలిత్ రెడ్డి ఇరగం 36 చేశారు. కడప జట్టులోని మోక్షజ్ఞ గౌడ్ 3 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 158 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన కడప జట్టు 25.3 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 161 పరుగులు చేసి ఏడు వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఆజట్టులోని తాహిర్ 35, యోగాంజనేయులు 32, విష్ణువర్ధన్ 31 పరుగులు చేశారు.

10 నుంచి వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి - కమలాపురం టౌన్ : వైఎస్ఆర్ జిల్లా కమలాపురంలో భారత ప్రభుత్వం, క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ కేంద్రం కడప శాఖ, మదర్ థెరిసా సేవా సమితి ఛారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో సంక్రాంతి పండగ పురస్కరించుకొని కమలాపురం నియోజకవర్గ (కమలాపురం, వీరపునాయునిపల్లె, వల్లూరు, చెన్నూరు, చింతకొమ్మదిన్నె పెండ్లిమర్రి, మండలం) స్థాయిలో వాలీబాల్ పోటీలు ఈనెల 10న సిఎస్ఎస్ ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ (అటానమస్) కళాశలో నిర్వహిస్తామని కరస్పాండెంట్ రాజగోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వాలీబాల్ పోటీలో 15 - 29 సంవత్సరాలలోపు పాల్గొన్నాలన్నారు. గెలుపొందిన వారికి ట్రోఫీతో పాటు నగదు బహుమతి ప్రదానం చేస్తామన్నారు. పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి భారత ప్రభుత్వం వారి సర్టిఫికెట్లు అందజేస్తుందని పేర్కొన్నారు. పోటీలో పాల్గొనే వారు గురువారం సాయంత్రం 5 గంటల లోపు 9381454069, 6301423495లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.

ఎన్‌సిడి సర్వేను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - పల్లూరు : ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్‌సిడి సర్వే ఈనెల 20 నుంచి నిర్వహించనున్నామని, ఆశా కార్యకర్తలు విజయవంతం చేయాలని ఎన్‌సిడి మండల నోడల్ అధికారి డాక్టర్ రవిబాబు అన్నారు. మంగళవారం స్థానిక పిహెచ్‌సి లో ఆశా కార్యకర్తలకు సమావేశం నిర్వహించారు. జిల్లా టిబి, లెప్రసి, ఎన్‌సిడి హాజరై ఆశా కార్యకర్తలకు సర్వే పైన అవగాహన కల్పించారు. ఫిబ్రవరి 2 వరకు సర్వే ఉంటుందని తెలిపారు. ప్రజలకు ఎన్‌సిడి సర్వేపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. గర్భిణుల నమోదు, ఒక స్కూల్ హెల్త్ ప్రోగ్రాం పైన ప్రచారం చేసి విజయవంతం చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో వైద్యులు మనోహర్, లక్ష్మీ ప్రసన్న, సిహెచ్‌ఒ వేణుగోపాల్, సూపర్‌వైజర్ మమత, సుధాకర్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అవినీతిపై విచారించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప ఐసిడిఎస్‌లో అవినీతిపై విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు మనోహర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో అంగన్వాడీ సెంటర్ల అవసరాల నిమిత్తం అప్పటి ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా ఉన్న కొన్నింటిలో ఒకొక్క సెంటర్‌కు రూ. 3 వేలు ఇచ్చిందని పేర్కొన్నారు. వాటితో సంబంధం లేకుండా జిల్లాలోని ఐసిడిఎస్ జిల్లా అధికారులు చిన్న గ్యాస్ స్టవ్, మార్కరు, కుర్చీ, బోర్డు, చాప ఇచ్చి రూ. 3000 వెనక్కి తీసుకోవడంలో అంతర్యం ఏమిటని పేర్కొన్నారు. గతంలో పనిచేసిన కడప అర్బన్ సిడిపిఒ ఆయాల ప్రమోషన్ల కోసం రూ.30 వేలు దాకా డబ్బులు, పోపు సామాన్ల మీద 3 శాతం కమిషను తీసుకోవడాన్ని నిరసిస్తూ జిల్లాలో పెద్ద ఎత్తున సిఐటియు ఆందోళన నిర్వహించిందని తెలిపారు. వాటి ఫలితంగా రాష్ట్ర ఐసిడిఎస్ అధికారులు, కడప అర్బన్ సిడిపిఒకు డిమోషన్ ఇచ్చి సత్యసాయి జిల్లాకు మార్చిందని పేర్కొన్నారు. ప్రస్తుతం వారి అరాచకాలు బయటపడతాయని ఉద్దేశంతో మళ్లీ కడపకు రప్పించడానికి కడప పీడీ తీవ్ర ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. తప్పుచేసిన కడప అర్బన్ సిడిపిఒను రప్పించడానికి జిల్లా అధికారులకు అబద్ధ సమాచారం ఇచ్చినా ఆశ్చర్యం లేదని పేర్కొన్నారు. ప్రస్తుతం కడపలో ఉన్న పీడీ కో-ఆపరేటివ్ డిపార్ట్‌మెంట్ అనిఅందరికీ తెలుసని తెలిపారు. గతంలో కడపలో ఉన్న అర్బన్ సిడిపిఒకు ప్రస్తుతమున్న పీడీకి ఉన్న సానిహిత్యంలో అంతర్యమేమిటో అర్థం కావడం లేదని చెప్పారు. వీటిపై గతంలో జిల్లా జెసి కి వినతి పత్రం అంద చేశామని తెలిపారు. ఐసిడిఎస్‌లో కొందరు చేస్తున్న సమస్యలు, ఇబ్బందులు అవినీతి పైన విచారణ చేసి భాధ్యులపై చర్యలు తీసుకోవాలని, లేకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని పేర్కొన్నారు.

'సాయిబాబా'లో అకాడమిక్ ఒడిసి పోటీలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : నగరంలోని అక్కాయపల్లిలో ఉన్న సాయిబాబా పాఠశాలలో మంగళవారం ఘనంగా అకాడమిక్ ఒడిసి పోటీలు నిర్వహించారు. 46వ డివిజన్ కార్పొరేటర్, పాఠశాల సిఇఒ ఎం.వి. శ్రీదేవి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలిగి తీసేందుకు కొత్త ఆవిష్కరణ దిశగా సంసిద్ధం చేయడానికి ఇలాంటి పోటీలు అవసరమని పేర్కొన్నారు. పాఠశాల వైస్ చైర్మన్ ఎం.వి సాయి సుధీర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పోటీ ప్రపంచానికి అనుగుణంగా కొత్త సాంకేతిక విధానాలను అవలంబిస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. వివిధ రంగాలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్ మెడల్ అందజేశారు.

ఫాస్ట్ ట్రాక్ కోర్టు బదిలీని వెంటనే ఆపాలి

ప్రజాశక్తి - కడప : కడప న్యాయవాద సంఘం ఆధ్వర్యంలో న్యాయవాదులు కొంతకాలంగా ఫాస్ట్ ట్రాక్ కోర్టును తిరుపతికి బదిలీ చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 145 ను వెంటనే రద్దు చేయాలని కోరుతూ మంగళవారం కుప్పం పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కడప బార్ అసోసియేషన్ అధ్యక్షులు బొగ్గుల గుర్రప్ప నాయుడు, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రెటరీ నంద్యాల చిన్నయ్య, ఉపాధ్యక్షులు చంద్రమోహన్, సీనియర్ న్యాయవాది పి. జయ రామిరెడ్డి వినతి పత్రం అందజేశారు. కేసుల విచారణలో జరిగే కాలం వల్ల కడప జిల్లా నుంచి కానీ ఇతర ప్రాంతాల నుంచి సదరు కోర్టుకు హాజరయ్యేందుకు న్యాయవాదులు కక్షిదారులు, అధికారులు అధికంగా ఖర్చు పెట్టాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే న్యాయ పరంగా తలెత్తే సవాళ్లు కూడా ప్రజల కు సంబంధించిన న్యాయపరమైన హక్కులకు భంగం వాటిల్లుతుందని, అందువల్ల వెంటనే ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలని కోరారు. స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిశీలిస్తామని హామీ ఇవ్వడం ఆనందదాయకమని కడప బార్ అసోసియేషన్ అధ్యక్షులు బొగ్గుల గురప్ప నాయుడు తెలిపారు. ముఖ్యమంత్రి వ్యక్తిగత కార్యదర్శి ప్రద్యుమ్న ఐఎఎస్‌ను కూడా కలిసి సమస్యను వివరించినట్లు తెలిపారు.



మాజీ ఎమ్మెల్యేకు వెంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న నాయకులు

మాజీ ఎమ్మెల్యేకు ఘన సన్మానం

ప్రజాశక్తి - ఖాజీపేట

మైదుకూరు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డిని ప్రొద్దుటూరులోని ఆయన నివాసంలో మంగళవారం ఖాజీపేటకు చెందిన పలువురు మండల వైసిపి నాయకులు కలిశారు. అగ్రహార సహకార సంఘం మాజీ అధ్యక్షులు పివి రాఘవరెడ్డి, నియోజకవర్గ వైసిపి జాయింట్ సెక్రెటరీగా నియామకం పొందిన సందర్భంగా మాజీ ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని బహుకరించారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ దుగ్గిరెడ్డి మురళీమోహన్‌రెడ్డి, కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ అధ్యక్షులు దుగ్గిరెడ్డి శ్రీనివాసుల రెడ్డి, కొత్తపేట శెట్టిపల్లె సిద్ధారెడ్డి, గుత్తికొట్టాల్ వేమారెడ్డి, కూనవారిపల్లె సర్పంచ్ సుబ్బారెడ్డి, పాటిమీద పల్లె సుబ్బరాయుడు, మనోజ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న టిడి శ్రీహరిబాబు

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

రైతులు తమ సమస్యలను అర్జీల రూపంలో ఇస్తే వాటిని పరిష్కరిస్తామని డిప్యూటీ తహశీల్దార్ శ్రీహరిబాబు తెలిపారు. మండలంలోని దేవతాపురంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్ఐ గోపాల్, విఆర్ఒ రాజా కుళాయిరెడ్డి పాల్గొన్నారు.

గర్భిణులకు టీకా తప్పనిసరి

ప్రజాశక్తి - ముద్దనూరు

గర్భిణులు టీకా తప్పనిసరిగా వేయించుకోవాలని పిహెచ్‌సి వైద్యాధికారులు శ్రీకాంత్, నాగార్జున తెలిపారు. స్థానిక పిహెచ్‌సిలో మంగళవారం వైద్యాధికారుల ఆధ్వర్యంలో ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యాధి నిరోధక టీకాల ప్రాముఖ్యత గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గర్భిణుల వివరాలు వంద శాతం నమోదు చేయాలన్నారు. అప్పుడే పుట్టిన పిల్లలకు జీరో డోస్ పోలియో, బిసిజి టీకాలు వేయాలన్నారు. ప్రతి ఒక్క బిడ్డకు 6, 10, 14 వారాల్లో టీకాలు వేయాలని సూచించారు. కాన్పులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో అయ్యేలా ప్రోత్సహించాలన్నారు. ఎన్‌సిడి, సిడి సర్వే వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో విస్తరణ అధికారి శ్రీనివాసరెడ్డి, ఆశా నోడల్ అధికారి శోభాకుమారి, సూపర్‌వైజర్ రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

తొండూరు : నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం టీకాలు వేయించాలని డాక్టర్ రేష్మా పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ రేష్మా ఆధ్వర్యంలో మంగళవారం ఆశా డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ అర్హులైన పిల్లలందరికీ టీకాలు అందించాలని తెలిపారు. టీకాలు వేయు ప్రదేశం శుభ్రంగా ఉంచాలన్నారు. అర్హులందరికీ వందశాతం టీకాలు వేయాలని ఆదేశించారు. కాలానుగుణంగా వ్యాధులు, ఊపిరితిత్తుల వ్యాధులు నివారణపై చర్యలు వివరించాలన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ ఆరోగ్య అధికారిని విజయ, హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య, సూపర్వైజర్ శశికళ, హెల్త్ ప్రొవైడర్స్ సోమేశ్వరి, శిరీష, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చౌకదుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని 11 చౌక దుకాణాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తహశీల్దార్ నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పైడిపాలెం, నంద్యాలపల్లె, కసనూరు, వై.కొత్తపల్లె, సింహాద్రిపురం-4, గురిజాల, బిదినంచర్ల-1, బి.చెర్లోపల్లె, లోమడ, బలపనూరు, గురజాల బీసీ కాలనీ(కొత్త దుకాణం)కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఆయా గ్రామాల పరిధిలో నివాసముండి ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు. రిజర్వేషన్ ఆధారంగా షాపులను కేటాయించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఆయా గ్రామాల్లోని సచివాలయంలో రిజర్వేషన్ ప్రాతిపదికను పరిశీలించి దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 9న సాయంత్రం 5 గంటల్లోపు రెవెన్యూ కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థులకు ఈనెల 17న రాత పరీక్ష ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిని కలిసిన నాయకులు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్



పులివెందుల టిడిపి మాజీ పట్టణ అధ్యక్షుడు మద్దూరు వెంకటరామిరెడ్డి, టిడిపి నాయకులు సా రెడ్డి గంగాధర్‌రెడ్డి మంగళవారం విజయవాడ క్యాంపు కార్యాలయంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవితమ్మను కలిశారు. ఈ సందర్భంగా వారు మంత్రితో మాట్లాడుతూ సారెడ్డి గంగాధర్‌రెడ్డి కుమారుడు ఇటీవల వ్యవసాయంపై యూట్యూబ్‌లో ఒక ఆల్బమ్ క్రియేట్ చేశారని తెలిపారు. అందుకు సంబంధించిన పోస్టర్‌ను వారు మంత్రిచే ఆవిష్కరింపజేశారు. ఈనెల 15న మంత్రి జన్మదిన సందర్భంగా వ్యవసాయానికి సంబంధించి యూట్యూబ్ లఘు చిత్రాన్ని ప్రారంభించాలని కోరామన్నారు. ఇందుకు సవితమ్మ సానుకూలంగా స్పందించారన్నారు. ఆల్బమ్‌లో రైతులకు ఉపయోగపడేలా ఉండడం మంచి విషయమని సారెడ్డి గంగాధర్‌రెడ్డిని అభినందించారు.

ఎట్టకేలకు టిడ్కో ఇళ్ల సమస్య పరిష్కారం



ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

చాలా రోజులుగా లబ్ధిదారులను వేధిస్తున్న టిడ్కో ఇళ్ల సమస్య ఎట్టకేలకు పరిష్కారమైంది. పేదల సొంత ఇంటి కల నెరవేరనుంది. స్థానిక ప్రొద్దుటూరు రోడ్డు లేఅవుట్‌లలో టిడ్కో ఇళ్ల నిర్మాణం జరిగింది. అపార్ట్మెంట్ల మాదిరి నిర్మించి 1,545 మంది లబ్ధిదారులకు మంజూరు చేశారు. వీరిలో 599 మందికి గత ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చింది. మిగిలిన 946 మందికి ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ స్టార్ట్ అయింది. నగర పంచాయతీ కమిషనర్ శేషపణి తన కార్యాలయంలో మాట్లాడుతూ టిడ్కో ఇళ్ల సమస్య తీరడంతో లబ్ధిదారులకు రోజుకు 20 మందికి కమలాపురం రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించి ఇవ్వనున్నట్లు తెలిపారు. టిడ్కో ఇళ్లలో రహదారుల నిర్మాణం, నీటి వసతి, విద్యుత్ వంటి కనీస వసతుల కల్పనకు చర్యలు చేపడుతున్నామన్నారు. పారిశుధ్య పనులను ప్రత్యేకంగా ఉదయం 5 నుంచి 8 గంటల వరకు పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తూ పరిశీలిస్తున్నానని కమిషనర్ పేర్కొన్నారు. పారిశుధ్య పనుల్లో భాగంగా రూ.24 లక్షలతో రెండు టాటాఏసు వాహనాలు కొత్తవి తీసుకున్నామన్నారు. కొత్త 14 డస్ట్ బిన్లు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. నాలుగు రోడ్ల కూడలిలో రూ.5లక్షలతో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. శ్మశాన వాటిక వెనుక నిర్మితమై నిరుపయోగంగా ఉన్న ఇఎల్ఎస్ఆర్ వాటర్ ట్యాంకు పునరుద్ధరించి నీటి కనెక్షను ఇస్తున్నట్లు తెలిపారు. 30 ఏళ్ల కిందట నిర్మించిన పైపులైన్ దెబ్బతినడంతో రూ.3కోట్లతో డిస్టిక్ మినరల్ ఫండ్ ద్వారా 10 వీధుల్లో పైప్‌లైన్ వేస్తున్నామన్నారు. పట్టణానికి తాగునీరు వచ్చే పోట్లదుర్తి సంప్ దెబ్బతినడంతో పునర్నిర్మాణం చేపడుతున్నామన్నారు. వేంపల్లి రోడ్డులో కాలువ, నీటి పైప్‌లైన్ ఒకదానికొకటి ఆనుకుని ఉండడంతో కొత్త పైప్‌లైన్ మంజూరుకు ప్రతిపాదనలు పంపామని ఆయన వివరించారు. మున్సిపాలిటీ కార్యాలయంలో కనీస వసతులు, సీసీ కెమెరాల ఏర్పాటు, రోడ్డుపై నుంచి కార్యాలయం వరకు సిమెంట్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామన్నారు. ఇప్పటికే కొన్ని పందులను పంపించామని, మిగతా వాటిని తీసుకెళ్లేందుకు వాటి యజమానులకు వారం గడువు ఇచ్చామన్నారు. కుక్కలు వృద్ధి చెందకుండా చర్యలు చేపట్టామన్నారు. సిబ్బంది కొరత తీవ్రంగా ఉన్నట్లు తెలిపారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్, హెల్త్ అసిస్టెంట్, టిపిఎస్, టిపిపిఒలు లేరని, ఎఇ లేకపోవడంతో ఇన్‌ఛార్జికి బాధ్యతలు అప్పగించారని తెలిపారు. పట్టణ అభివృద్ధికి ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ప్రత్యేకశ్రద్ధ చూపుతున్నారని కమిషనర్ తెలిపారు.

విభిన్నప్రతిభావంతులకు దుస్తులు వితరణ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

అంధుల లిపి ప్రదాత లూయి బ్రెయిలీ స్మారకోత్సవాలను పురస్కరించుకుని జేఎన్టీయూ హెల్పింగ్ హాండ్స్ విద్యార్థులు దివ్యాంగులకు జేఎన్టీయూ హెల్పింగ్ హాండ్స్ విద్యార్థులు దుస్తులు వితరణ చేశారు. మంగళవారం కళాశాలలోని కంప్యూటర్ సైన్స్ సెమినార్ హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రిన్సిపల్ ప్రొఫెసర్ విష్ణువర్ధన్, ఇతర అధ్యాపకులతో కలిసి బ్రెయిలీ చిత్రపటానికి పూల మాలవేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కళాశాల ఆంగ్ల అధ్యాపకులు ప్రొఫెసర్ సాంబయ్య ఆధ్వర్యంలో హెల్పింగ్ హాండ్స్ విద్యార్థులు విభిన్న ప్రతిభావంతులకు దుస్తులను వితరణ చేశారు. కార్యక్రమంలో కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ వేణుగోపాల్ రెడ్డి, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ మురళి, ఆంగ్ల అధ్యాపకులు ప్రొఫెసర్ సాంబయ్య మాట్లాడుతూ జేఎన్టీయూ హెల్పింగ్ హాండ్స్ విద్యార్థులు ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారని, ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న పేద విద్యార్థులకు విద్యాబోధన, మొక్కలు నాటడం, పర్యావరణ పరిరక్షణ, వికలాంగులకు, వ్యాధిగ్రస్తులకు, నిరుపేద విద్యార్థులకు, అనాధలకు ఎన్నో సందర్భాలలో చేయూతనిచ్చారని తెలిపారు. ఈ ఏడాది బ్రెయిలీ దినోత్సవ సందర్భంగా విభిన్నప్రతిభావంతులకు సహాయ సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వికలాంగుల నెట్ వర్క్ రాష్ట్ర అధ్యక్షులు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి, కళాశాల సిబ్బంది రామమునిరెడ్డి, కంప్యూటర్ సైన్స్, మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న విద్యార్థులు, ప్రిన్సిపల్

వరి సాగుపై రైతుల్లో ఆసక్తి..నాట్లు ముమ్మరం



కొనలు తుంచి రైతుకు చూపిస్తున్న వ్యవసాయ సహాయకురాలు శ్రీలత

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండలంలో వరినాట్లు ముమ్మరమయ్యాయి. మండలంలోని చిన్నదండ్లూరు, ఇల్లూరు, మాలెపాడు గ్రామాల్లో సుమారు 700 ఎకరాల్లో వరి పండిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాల ప్రభావంతో భూమిలో తేమ శాతం బాగా ఉండడం వల్ల రైతులు వరి సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారులు నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలని సూచిస్తున్నారు. నాటేటప్పుడు రెండు నుంచి మూడు మొక్కలు మాత్రమే ఒకచోట నాటడం మంచిదని సూచిస్తున్నారు. మూడు సెంటీమీటర్ల లోతుతో వరి నాట్లు వేసుకోవడం మంచిదన్నారు. యూరియా, పొటాషియం, భాస్వరం ఎరువులను తగిన మోతాదులో అవగాహనతో వేసుకోవాలని తెలిపారు. ఖర్చులు, కూలీలు, యంత్ర బాడుగలు పెరగడంతో ప్రస్తుత ధరలు గిట్టుబాటు అవడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎఒ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ వరి నాటేటప్పుడు నారు కొనలు తుంచాలన్నారు. తద్వారా పురుగు ప్రభావం తగ్గుతుందని వివరించారు. మందులు ఎరువులు పిచికారీ చేసేందుకు నాలుగు మీటర్లకు ఒకచోట ఒక అడుగు వెడల్పుతో కాలిబాట తప్పకుండా ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. తద్వారా గాలి, వెలుతురు పంటకు తగలడంతో తెగుళ్లు తగ్గుతాయని వివరించారు. మండల వ్యాప్తంగా ఉన్న రైతులు ఇకెవైసి ఈనెల 12లోపు తప్పక చేయించుకోవాలన్నారు.

చాపాడు : మండల పరిధిలోని మడూరు, అన్నవరం గ్రామాల్లో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి మ్యాగి మాట్లాడుతూ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద రబీలో వేసిన పంటలకు జనవరి 15 వరకు ప్రభుత్వం ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించడానికి గడువు ఉందన్నారు. రబీలో వరి సాగు రైతులు నారు పోసుకోవడానికి ముందే విత్తనశుద్ధి చేసుకున్నట్లయితే నారుమడిలో, పొలంలో నాటిన తర్వాత వచ్చే చీడపీడల నుండి రక్షణ పొందవచ్చని సూచించారు. పంటమార్పిడి చేయాలన్నారు. కాలానికి తగిన వరి రకాల ఎంపిక మీద అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విఎఎలు పి.లక్ష్మణ్, పి.శ్రీలత, రైతులు పాల్గొన్నారు.

ముద్దనూరు : నువ్వు పంటలో పిల్లోడి(వెర్రి) వైరస్ నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారి వెంకటకృష్ణారెడ్డి రైతులకు సూచించారు. కొత్తపల్లె గ్రామంలో పంట నమోదు కార్యక్రమాన్ని మంగళవారం ఎఒ పరిశీలించారు. అనంతరం నువ్వు, జొన్న పంటలు పరిశీలించారు. నువ్వు పంటలో పిల్లోడి (వెర్రి) వైరస్ తెగులు ఆశించిందన్నారు. ఈ లక్షణాలు కనిపించిన వాటిని వెంటనే పీకి ఏరి వేసి పక్కన పూడ్చి వేయాలన్నారు. దీని నివారణకు ఇమిడాక్లోపిడు 0.3 గ్రాములు, బూడిద తెగులు నివారణకు వెటబుల్ సల్ఫర్ అనే మందును 3 గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. రైతులకు తగిన సలహాలు సూచనలు చేశారు. రబీలో సాగు చేసిన అన్ని పంటలను తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలన్నారు. ఈనెల 30 వరకు అవకాశం ఉందన్నారు.



నువ్వు పంట పరిశీలిస్తున్న ఎఒ వెంకటకృష్ణారెడ్డి



మాట్లాడుతున్న రాహుల్, ప్రమాదంలో గాయపడిన అబ్దుల్

శ్రీచైతన్య స్కూల్ బస్సులపై చర్యలు తీసుకోవాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎద్దు రాహుల్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక శ్రీ చైతన్య విద్యాసంస్థల బస్సులపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎద్దు రాహుల్ డిమాండ్ చేశారు. మంగళవారం స్కూల్ బస్సు అబ్దుల్ మునాఫ్ అనే వ్యక్తిని ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ విద్యాసంస్థల బస్సులపై ఆర్టీఓ చర్యలు తీసుకోవాలన్నారు. శ్రీ చైతన్య విద్యా సంస్థలు బస్సులు ప్రభుత్వ విధానాల ప్రకారం కాకుండా విచ్చలవిడిగా నడుపుతున్నారన్నారు. ఆర్టీఓ విధానాలు ఉల్లంగించేలా నడుపుతున్నారని తెలిపారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా విద్యాశాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. శ్రీచైతన్య విద్యా సంస్థల యాజమాన్యం గాయపడిన అబ్దుల్ మునాఫ్ బాధ్యతను పూర్తిగా తీసుకోవాలన్నారు. వారికి నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ప్రభుత్వ విద్యా విధానాలకు వ్యతిరేకంగా నడుచుకుంటున్న జిల్లాలో ఉన్న శ్రీచైతన్య విద్యా సంస్థలపై ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. ప్రొద్దుటూరు ఎస్ఎఫ్ఐ నాయకులు జయంత్, సప్తగిరి, సునీల్, పాల్గొన్నారు.

బస్సులపై చర్యలు తీసుకోవాలని ఆర్‌టిఒకు డివైఎఫ్ఐ వినతి

పట్టణంలోని శ్రీచైతన్య విద్యాసంస్థల బస్సులను తనిఖీ చేయాలని డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం డేవిడ్ రాజ్, షెడ్యూల్ కులాల పరిరక్షణ సంఘం మేకల శేఖర్ కోరారు. ఆమేరకు వారు మంగళవారం ఆర్‌టిఒ మురళీధర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీచైతన్య విద్యా సంస్థల బస్సులపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యాసంస్థల బస్సు తగిలి ఒక యువకుడు ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడని, కర్నూలు ఆసుపత్రికి తరలించారన్నారు. నాయకులు ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు శ్రీచైతన్య విద్యా సంస్థకు చెందిన బస్సు ప్రమాదం వల్ల కార్పెంటర్ తీవ్ర గాయాలపాలైన పరిస్థితి ఉందని, ఫిట్నెస్ లేని బస్సులు నడిపిస్తూ ప్రమాదాలకు కారణం అవుతున్న శ్రీ చైతన్య విద్యా సమస్థలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి విశ్వనాథ్ డిమాండ్ చేశారు. ప్రొద్దుటూరులో విలేకరులతో విశ్వనాథ్ మాట్లాడుతూ శ్రీచైతన్య విద్యా సంస్థల యాజమాన్యాలు ఫిట్నెస్‌లేని డ్రైవర్లను, బస్సులను నడుపుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. విద్యార్థుల ప్రాణాలు గాలిలో పెట్టి బస్సులు నడుపుతున్నారన్నారు. అధికారులు రెగ్యులర్‌గా తనిఖీలు నిర్వహించకపోవడంతో ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయన్నారు. చిన్న, చిన్న స్కూల్స్ అయితే పెద్ద,పెద్ద చలనాలు విధిస్తూ బస్సులను సీజ్ చేస్తున్నారని తెలిపారు. చిన్న, రమణయ్య పాల్గొన్నారు.



ఆర్‌టిఒకు వినతిపత్రమిస్తున్న నాయకులు

బ్రాహ్మణులకు 9 ఆర్థిక యూనిట్లు మంజూరు

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కడప జిల్లాలో బిసి కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఉపాధి పథకాల కింద 9 మంది బ్రాహ్మణులకు రూ.22లక్షల రుణాలు మంజూరు చేయడానికి జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం సంచాలకులు ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా బ్రాహ్మణ సంఘం, బ్రాహ్మణ సంక్షేమ వేదిక అధ్యక్షులు ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. 9 యూనిట్లలో 8 యూనిట్లు స్వయం ఉపాధి పథకాలు, ఒక యూనిట్ జనరిక్ మెడికల్ షాపునకు మంజూరు చేసినట్లు తెలిపారు. ఒక్కొక్క యూనిట్ రూ.5 లక్షల రూపాయల వరకు స్వయం ఉపాధి పథకాల కింద ఇందులో 50 శాతం సబ్సిడీ 50 శాతం బ్యాంకు రుణం ఉంటుందని చెప్పారు. జనరిక్ మందుల షాపునకు రూ. 4లక్షల సబ్సిడీ, రూ.4లక్షల మేర రుణం ఇవ్వడానికి అధికారులు నిర్ణయించారని తెలిపారు. వీటితోపాటు ఇబిసి కార్పొరేషన్ కింద 74 మందికి 50 శాతం సబ్సిడీతో రూ.కోటి 28 లక్షలు రుణాల అందించడానికి అధికారులు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఇందులో కూడా బ్రాహ్మణులకు అవకాశం ఉంటుందన్నారు. ఇబిసి సర్టిఫికెట్ ఉన్నవాళ్లు ఇబిసి కార్పొరేషన్ రుణాలకు అర్హులని చెప్పారు. బ్రాహ్మణ కార్పొరేషన్ కింద 9 యూనిట్లు, ఇబిసి కార్పొరేషన్ కింద 74 యూనిట్లు మంజూరు అవుతాయని చెప్పారు. కాబట్టి అర్హులైన నిరుద్యోగ బ్రాహ్మణ యువతీ యువకులు ఈనెల 16వ తేదీలోగా తమ దరఖాస్తులను మండలం లేదా మున్సిపల్ కార్యాలయాల్లో అందజేయాలని తెలిపారు.



విద్యార్థులకు సూచనలిస్తున్న రిజిస్ట్రార్ అమరేంద్ర కుమార్

రెండు కొత్త కోర్సుల ఏర్పాటుకు యత్నాలు

ప్రజాశక్తి - వేంపల్లె

ఆర్జీయూకేటీ పరిధిలోని ట్రిపుల్‌ఐటిలో వచ్చే విద్యా సంవత్సరంలో రెండు కొత్త కోర్సులైన ఆర్టిఫిషియల్ లెర్నింగ్ (ఎ-ఐ), మిషన్ లెర్నింగ్ (ఎంఎల్) కోర్సులను ప్రవేశ పెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆర్జీయూకేటీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ అమరేంద్ర కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని ఇడుపులపాయ, ఒంగోలు ట్రిపుల్‌ఐటిలను రిజిస్టర్ అమరేంద్ర కుమార్, డైరెక్టర్ కుమార స్వామి గుప్తాతో కలిసి పరిశీలించారు. విద్యార్థులతో, అధ్యాపకులతో వేర్వేరుగా విద్య బోధనపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి సెమిస్టర్ పరీక్షల్లో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని చెప్పారు. ఆ దిశగా అధ్యాపకులు విద్య బోధన చేయాలని ఆదేశించారు. విద్యార్థులు కూడా ప్రణాళిక బద్దంగా చదివి రెమిడియల్స్ లేని విద్యార్థులుగా నిలవాలని కోరారు. కొత్త కోర్సులు ఏర్పాటు కోసం పియుసి, ఇంజనీరింగ్ కరికులమ్‌లో మార్పులు చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో డైరెక్టర్ కుమార స్వామి గుప్తా, పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్, అకాడమిక్ డీన్, స్టూడెంట్ వెల్ఫేర్ డీన్, ఆర్థిక అధికారితోపాటు విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



ఇఇకి వినతిపత్రాన్నిస్తున్న ఎంపిజె నాయకులు

కొత్త స్మార్ట్ మీటర్ల విధానాన్ని వెనక్కి తీసుకోవాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

అదానికి లబ్ధి చేకూర్చే స్మార్ట్ మీటర్ల విధానాన్ని వెనక్కి తీసుకోవాలిని కోరుతూ మంగళవారం ఎపిసిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమణారెడ్డికి ఎంపిజె రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలీం, రాయలసీమ ఇన్‌ఛార్జి ఎండి అయూబ్ ఖాన్ వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సలీం మాట్లాడుతూ రాష్ట్రంలో గుట్టుచప్పుడు కాకుండా కూటమి ప్రభుత్వం ప్రైవేటు సంస్థలతో పాత మీటర్లు తీసేసి కొత్త స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారన్నారు. ప్రభుత్వం ద్వారా ఎలాంటి జిఒ విడుదల చేయకుండా, ప్రజలకు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ప్రీపెయిడ్ విధానం ద్వారా కరెంటు ముందస్తుగా రీఛార్జ్ చేసుకుంటేనే వచ్చేలా పగలు ఒక రేటు రాత్రి ఒక రేటు సామాన్యుల నడ్డి విరిచే విధానాన్ని తీసుకురావడం చాలా దారుణమన్నారు. కార్యక్రమంలో ఎంపిజె జిల్లా అధ్యక్షుడు జాకీర్ ఉమ్రి, పట్టణ అధ్యక్షుడు హుస్సేన్‌బాషా, కార్యదర్శి మహమ్మద్ రఫీ, సభ్యులు ముక్తార్, కింగ్ బాషా, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీకి అనారోగ్యం

- పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

కూటమి పాలనలో ఆరోగ్యశ్రీ పథకానికి అనారోగ్యం చేసిందని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పేదలకు కూడా ఉచితంగా మెరుగైన కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించాలన్న ఉద్దేశంతో 2007లో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో సిఎంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నంతకాలం ఈ పథకం బ్రహ్మాండంగా అమలైందన్నారు. వైసిపి, టిడిపి కూటమి ప్రభుత్వాలు ఆరోగ్యశ్రీ పథకాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశాయని విమర్శించారు. అనేక సందర్భాల్లో నెట్‌వర్క్ ఆసుపత్రులు ఆరోగ్యశ్రీ కింద సేవలు నిలిపి వేసినట్లు చెప్పారు. కూటమి అధికారంలోకి వచ్చిన 7 నెలల కాలంలోనే నెట్‌వర్క్ ఆసుపత్రుల అసోసియేషన్ 4సార్లు ప్రభుత్వానికి పెండింగ్ బిల్లులు చెల్లించని పక్షంలో ఆరోగ్యశ్రీ సేవలు నిలిపి వేస్తామని నోటీసులు ఇచ్చాయన్నారు. ఈ నెల 6 నుంచి ఆరోగ్యశ్రీ సేవలు నిలిపి వేస్తున్నామని నోటీసులు ఇచ్చారన్నారు. అయినా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేక పోవడం గర్హనీయమని విమర్శించారు. వెంటనే పెండింగ్ బిల్లులు రూ.3వేల కోట్లు చెల్లించి నెట్‌వర్క్ ఆసుపత్రులు ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేయకుండా చూడాలని కూటమి ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పి.నారాయణ రెడ్డి

విద్యార్థులకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి - చాపాడు(మైదుకూరు)

మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి అధ్యక్షతన వాణిజ్య శాస్త్ర విభాగం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సిబిఐటి ప్రొఫెసర్ డాక్టర్ ఉమాదేవి కళాశాలలోని విద్యార్థులకు, అధ్యాపకులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే ఇన్వెస్ట్ మీద అవగాహన కలిగినట్లయితే చక్కటి ప్రణాళికతో విద్యార్థులు మంచి ఆర్థిక క్రమశిక్షణ కలిగి ఉంటారన్నారు. ప్రత్యేక ఆహ్వానితులు అవగాహన కర్త ప్రొఫెసర్ ఉమాదేవి మాట్లాడుతూ సమాజంలోని ప్రతి ఒక్కరూ ఆర్థిక క్రమశిక్షణ కలిగి, అనవసరమైన ఖర్చులను తగ్గించుకొని భవిష్యత్తును ఉజ్వలంగా తెచ్చుకోవడంలో ఆర్థిక క్రమశిక్షణ కీలకపాత్ర పోషిస్తుందని వివరించారు. మ్యూచ్యువల్ ఫండ్స్, స్టాక్ మార్కెట్లపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వాణిజ్య శాస్త్ర అధ్యాపకులు పి.చిన్న రాయుడు, ఎన్ఎస్ఎస్ పిఓ డాక్టర్ పివి కృష్ణారెడ్డి, నరసింహారావు, అయ్య వారురెడ్డి, అనురాధ లక్ష్మి, వైస్ ప్రిన్సిపల్ సుభాన్ సాహెబ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కోలాటం ఆడుతున్న యువకులు

ఆకట్టుకున్న కోలాటం

ప్రజాశక్తి - వేముల

చిన్న గొందిపల్లెలో అభయాంజనేయ స్వామిని ప్రతిష్టించి 41వ రోజు సందర్భంగా గ్రామ ప్రజలు గడియారం కిరణ్‌కుమార్ శర్మచే స్వామివారికి అభిషేకం, హెూమం పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథులుగా మండల కన్వీనర్ నాగేల్ల సాంబశివరెడ్డి, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథి రెడ్డి కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. మొయిళ్లచెరువు, మొబ్బు చింతలపల్లి, వేముల, గిడ్డంగివారిపల్లి కోలాట బృందాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. కార్యనిర్వాహకులు సర్పంచ్ దేవన నారాయణమ్మ, రామాంజనేయులు, ముసలయ్య, పెద్ద పుల్లయ్య, నాగాంజనేయులు, సదాశివుడు, అచ్చివెల్లి, కిట్టయ్య, ఓబులేసు, బీసీ సెక్రెటరీ గంగాధర యాదవ్, చుట్టుపక్కల గ్రామ ప్రజలు పాల్గొన్నారు.